క్లుప్తంగా

సీఎం సహకారంతో రహదారుల అభివృద్ధికి కృషి


సఖినేటిపల్లి లాకుపేటలో తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల రహదారులు అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద రావు అన్నారు. శుక్రవారం సఖినేటిపల్లిలో బళ్లేపేట, లాకుపేటల్లో జేజేఎంలో కొత్తగా నిర్మించిన తాగునీటి ట్యాంకులను రెండింటినీ, సీసీ రోడ్లు రెండింటినీ ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే వీటి శిలాఫలకాలను ఆవిష్కరించారు. సర్పంచ్ గొల్లమండల చిట్టిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, కో ఆప్షన్ మెంబర్ బి.నోబుల్ ప్రభాకర్, ఎంపీటీసీలు నల్లి రత్నకుమార్, కట్టా వెంకాయమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, పెదపాటి నాగలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు రుద్రరాజు రంగరాజు, గెద్దం అమ్ములు, కుసుమ చింటూ పాల్గొన్నారు.

నేడు చెరువు పార్క్ ప్రారంభోత్సవం

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో రుడా నిధులతో అభివృద్ధి చేసిన పార్కును శనివారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లుగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. చెరువు చుట్టూ పార్క్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మధ్యలో దేవాలయం నిర్మించి ఉన్నందున ఈ ప్రదేశానికి ప్రత్యేకత సంతరించుకుందన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

వైభవంగా ఏకాహం

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన యువ గణపతి ఆలయ ప్రాంగణంలో 34వ ఏకాహాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు కొడమంచిలి నాగేశ్వర రావు, కొడమంచిలి ఫణికుమార్‌ల ఆధ్వర్యంలో పూజను నిర్వంచారు. ఆలయ ప్రాంగణంలో ఏకాహం ఏర్పాటు చేశారు. శనివారం అన్న సమారాధన చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మృతి


గంటా ప్రకాశరావు (ఫైల్)

మలికిపురం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అహర్నిశలూ శ్రమించిన పార్టీ సీనియర్ నేత గంటా ప్రకాశరావు(77) శుక్రవారం మృతి చెందారు. ఆటో కార్మికుడు అయిన ప్రకాశరావు జగన్‌పై అభిమానంతో తన ఆటోలో గర్భిణులకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించి సేవలు అందించారు. గురువారం ఆయన ఆకస్మిక మృతి చెందారు. ఆయన మృతికి రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు ప్రగాఢ సంతాపం ప్రకటించి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, పార్టీ నాయకులు కెఎస్ఎన్ రాజు, గెద్దం తులసీ భాస్కరరావు, రొక్కాల వెంకట్, అశోక్ తదితరులు సంతాపం తెలిపారు.

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు

మామిడికుదురు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పి.గన్నవరం సీఐ ఎం.ప్రశాంత్‌కుమార్, నగరం ఎస్సై పి.సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. మామిడికుదురులోని నగరం పోలీస్ స్టేషన్ వద్ద నుంచి 216వ నంబర్ జాతీయ రహదారి మీదుగా బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం వరకు ఈ కవాతు జరిగింది. 45 మంది సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ కవాతు జరిగింది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగే విధంగా ప్రజలు, రాజకీయ పార్టీలు సహకారం అందించాలని ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్సై సురేష్ కోరారు. పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్‌తో పాటు అప్పనపల్లిలోనూ పోలీస్ కవాతు జరిగింది.

మంచినీటి పరిశుభ్రతను బాధ్యతగా తీసుకుందాం

ఆలమూరు: మంచినీటి పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.నాగేశ్వరరావు, తహసీల్దార్ డీవీఎస్ అనిల్ కుమార్, ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్, ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలమూరు మండలంలోని 18 గ్రామాల పరిధిలోని 26 మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచే ప్రత్యేక డ్రైవ్ శుక్రవారం ముగిసింది. అధికారుల బృందం తొలుత గ్రామ పంచాయతీలను సందర్శించి ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని 15 రోజులకోసారి గ్రామంలోని ట్యాంకులను శుభ్రపరుస్తూ ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించాలని వారు కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


పి.గన్నవరంలో గరుడేశ్వర స్వామికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి దంపతులు


అప్పనపల్లిలో కొబ్బరి ఆకులతో తయారు చేసిన శివలింగం


ముక్తేశ్వరంలో పూజలందుకుంటున్న ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వరస్వామి


మలికిపురంలో ఆకట్టుకున్న శివలింగం

హరహర శంభో..

- కన్నులపండువగా మహాశివరాత్రి
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు


అప్పనపల్లిలో గృహలో కొలువుదీరిన శివుడు, శివలింగం సెట్టింగ్


పలివెలలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రాజోలు: శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు భక్తులు శివకోడు, కడలి, రాజోలు, పొన్నమండ తదితర శివాయాల్లో పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

సఖినేటిపల్లి: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మోరి, గుడిమూల గ్రామాల్లో ఘనంగా రథోత్సవాలు నిర్వహించారు. గుడిమూల రథోత్సవంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన వెంట దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రాము, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.


జి.అగ్రహారంలో కొలువుతీరిన వీరేశ్వరస్వామి

మామిడికుదురు: మహా శివరాత్రిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అప్పనపల్లిలో 10,116 జ్యోతులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ, భారీ సెట్టింగులతో పాటు అదే గ్రామంలోని సంతపేటలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మొగలికుదురు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి రథోత్సవం కనులపండువలా జరిగింది.

అంబాజీపేట: మండలంలోని శివాలయాల్లో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, మాచవరం, గంగలకుర్రు అగ్రహారం, కోశివారి అగ్రహారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. శివరాత్రి మహోత్సవంలో భాగంగా అంబాజీపేట వాసంశెట్టివారిపాలెంలో జరుగుతున్న వీరన్నబాబు సంబరాల్లో శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరంలో కొలువైన అతి ప్రాచీన ముక్తికాంత క్షణముక్తేశ్వరుని ఆలయం శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్తుల శివ నామోచ్చారణ మధ్య మార్మోగింది. ముక్తేశ్వరం వృద్ధగౌతమి (తొగరపాయ) వద్ద భక్తులు అధిక సంఖ్యలో పుణ్యస్నానాలు చేశారు. భక్తులకు విశ్వబ్రాహ్మణ సంఘీయులు, దేవంగుల సత్రం, పళ్లస్వామి చారిటీస్, శ్రీఘాకోళపు సత్రం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులకు అయిన విల్లిలంకకు చెందిన కోడూరి రవి, తొత్తరమూడికి చెందిన కుప్పాల బాలకృష్ణ, తాతాజీ సోదరులు ప్రసాద వితరణ చేశారు.

ముక్తేశ్వరంలోని ముక్తికాంత క్షణముక్తేశ్వరస్వామిని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

మలికిపురం: మండలంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కేశనపల్లి, లక్కవరం, మలికిపురం, రామరాజులంక, విశ్వేశ్వరాయపురం, చింతలమోరి, బట్టేలంక, గూడపల్లి, మట్టపర్రు, గుడిమెళ్లంక, మేడిచర్లపాలెం, గొల్లపాలెం తదితర గ్రామాల్లో శివాలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం దీపాలంకరణలు నిర్వహించారు.

పి.గన్నవరం: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున మూడు గంటల నుంచి భక్తులు పరమేశ్వరునికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులు క్యూలో బారులు తీరారు. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సమర్పించిన వెండి జటాజూటాన్ని స్వామికి అలంకరించారు. గరుడేశ్వరస్వామికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

సఖినేటిపల్లి: మండలంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మోరి, గుడిమూల, అంతర్వేది, టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, అంతర్వేదికర, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లిలంక, గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు కిటకిలలాడారు.

ఆత్రేయపురం: మండలంలోని శివాలయాలకు శివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. వసంతవాడ పార్వతీ పరమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రావులపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. రావులపాలెంలోని వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయం, ఊబలంక, లక్ష్మీపోలవరం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆలమూరు: క్షీర సాగర మధనంలో వెలువడిన హలహలాన్ని తన కంఠంలోనే నిలుపుకుని ముల్లోకాలను కాపాడిన రోజైన మహాశివరాత్రికి ప్రత్యేకత ఉంది. ఈ రోజంతా ఉపవాసం చేసి శివనామస్మరణ చేస్తే సకల సంపదలతో పాటు కోరికలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

వైభవంగా ఉమా కొప్పేశ్వరుల రథోత్సవం

కొత్తపేట: మహాశివుని కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో బాగుండాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆకాంక్షించారు. మహాశివరాత్రి సందర్భంగా పురాణ ప్రసిద్ధి చెందిన కొత్తపేట మండలం పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి క్షేత్రంలో ఉమా కొప్పేశ్వరులను శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనం పూజల అనంతరం ప్రధాన ఘట్టమైన రథోత్సవాన్ని భక్తులు ముఖ్యంగా యువత కోలాహలం మధ్య ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించగా అత్యంత వైభవంగా సాగింది.


మడికిలోని సోమేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు


ఊబలంకలో పూర్ణాలంకరణలో స్వామి అమ్మవార్లు


కూనవరంలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం


గుడిమూలలో రథయాత్ర

అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


మడికి కూరగాయల మార్కెట్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో వేంచేసిన అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఏటా మహా శివరాత్రి పర్వదినాన్ని మార్కెట్‌కు సెలవు ప్రకటించి వేలాది మందికి పిండి వంటలతో అన్న సమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, సర్పంచ్ యు.లక్ష్మీమౌనిక, చెల్లుబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలివెల క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

మండలంలోని పలివెలలో ఉమా కొప్పేశ్వరస్వామి వారి క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు పోటెత్తారు. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కాంతిభారతి విద్యాసంస్థల తరఫున ఆ సంస్థ కరస్పాండెంట్ తోట సత్యవాణి దంపతులు పలువురు దాతలు ఆర్థిక సహాయంతో భక్తులకు అల్పాహారం, వాటర్ ప్యాకెట్లు సమకూర్చారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు పలివెల ధర్మసత్రం చైర్మన్ సీహెచ్ సాయిబాబు, ఈఓ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు.

కాపునాడు గోదావరి జిల్లాల కార్యదర్శిగా కాశీ


మంగారావు నుంచి కార్యదర్శిగా నియామక ఉత్తర్వులు అందుకుంటున్న కాశీ

మామిడికుదురు: ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు కార్యదర్శిగా మొగలికుదురు గ్రామానికి చెందిన పోతు కాశీని నియమించారు. కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు తనకు నియామక ఉత్తర్వులు అందించారని కాశీ శుక్రవారం తెలిపారు. మంగారావు సహకారంతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్, ఉపాధ్యక్షుడు గంగుమళ్ల శ్రీను, కాకిలేటి దుర్గారావు సహకారంతో కాపునాడును ఉభయ గోదావరి జిల్లాల్లో మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ చేపడతామన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించి కాపునాడును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. కాశీని పలువురు అభినందించారు.

మహిళలు ఆరు నెలలకోసారి పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత రోజుల్లో 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళా ఆరునెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఎస్.హెవార్డురాజ్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక స్త్రీల ఆసుపత్రిలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి మాట్లాడుతూ స్త్రీల ఆసుపత్రిలో పెద్దమ్మ, చిన్నమ్మలుగా పేరుగాంచిన డా.లీజర్, సిల్వియా రైట్‌ల సేవలు చిరస్మరణీయమన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న డా.జయశ్రీ 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యురాలు డాక్టర్ షైనీ మాట్లాడుతూ దంత విభాగం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 15 వరకు అన్ని రకాల దంత వైద్య సేవలపై 25 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. డాక్టర్ హేవార్డురాజ్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మహిళలు ఎక్కువగా గర్భాశయ, స్తన్య క్యాన్సర్, రక్తహీనత, హెచ్‌పీవీ, తదితర సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ పరీక్షలు ప్రైవేటు పరీక్ష కేంద్రాల్లో చేయించుకొంటే అధిక మొత్తాలు అవుతున్నాయని, స్థానిక స్త్రీల ఆసుపత్రిలో తక్కువ ధరలకే చేస్తున్నారని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయరాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ దోపిడీ పార్టీ

మాజీ మంత్రి గొల్లపల్లి


మలికిపురంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కేఎస్ఎన్ రాజును కలిసిన మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: తెలుగుదేశంపార్టీ దోపిడీ పార్టీ అని, ఆ పార్టీ నేతలను నమ్మి ఓట్లు వేయొద్దని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. ఇటీవల తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరిన ఆయన శుక్రవారం మలికిపురంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, కునాధరాజు చంటిరాజులను కలిసి శాలువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అనేక ఏళ్లుగా ఎంతో సేవ చేశానని, కానీ ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు తన సేవలను గౌరవించకుండా అవమానించారని అన్నారు. తెలుగుదేశం పార్టీలో దళితులకు, బీసీలకు స్థానం లేదని చెప్పారు. ఐదేళ్లుగా సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలన చూసి ఈ పార్టీలో చేరానని అన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ఒక సామాన్య కార్యకర్తలా శ్రమిస్తానని అన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు బండారు కాశి, సరెళ్ళ విజయ ప్రసాద్, స్టుడియో వర్మ ఉన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి సాయం

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు గొల్లగుంటలో కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న గుబ్బల బాలాజీరావుకు రెడ్ క్రాస్ జీవిత కాలం సభ్యులు సాయాన్ని శుక్రవారం పంపిణీ చేశారు. బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు బెహరా వీర హనుమంతరావు, స్థానికుడు లక్కింశెట్టి భాస్కరరావు సమకూర్చిన నిత్యవసరాలు, బియ్యం, కిరాణా సరకులను సర్పంచ్ జల్లి బాలరాజు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సేవకులకు సన్మానం


సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సామాజిక సేవా కార్యకర్త పద్మావతి


లక్కవరంలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న రొటేరియన్లు


రాజోలులో పారిశుధ్య కార్మికులను సత్కరించిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

మలికిపురం: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా లక్కవరం పీహెచ్‌సీలో వైద్య వృత్తిలో వివిధ సేవలు అందిస్తున్న మహిళా సేవకులకు సన్మానం చేశారు. లక్కవరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.భావన. ఉపాధ్యాయిని ఇంజేటి మేరీ కుమారి, స్టాఫ్ నర్స్ జి.జోషి వెర్జినియా, ఏఎన్ఎం సత్యవతి, ఆశా వర్కర్ ఎం.విజయ, రిటైర్డ్ ఎమ్మార్వో బత్తుల ఝాన్సీబాయి తదితరులకు రోటరీ మెమెంటోతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ సోమిశెట్టి మురళీకష్ణ, అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, కార్యదర్శి బందెల సంపత్, ట్రెజరర్ తోలేటి సతీష్, రొటేరియన్స్ గుబ్బల బాబ్జి, గెద్దం ఫిలిప్‌రాజు, బత్తుల ఝాన్సీబాయి, గెద్దం తులసీ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మామిడికుదురు కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళా దినోత్సవ కేక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ కట్ చేశారు. చదువుకున్న ప్రతి మహిళ తన కుటుంబంతో పాటుగా సమాజాన్ని జాగృతం చేసేందుకు ముందుండాలని తద్వారా దేశాభివృద్ధికి ఆయుధం కావాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు. అధ్యాపకులు మోకా రంగారావు, బి.సృజన, పి.రాధ, జి.సుజాత, సీహెచ్ ప్రసన్న, ఎం.మౌళి పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని, విద్య, వైద్య పారిశ్రామిక, ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక, రాజకీయ, రంగాల్లో కూడా ముందంజలో ఉండాలని మహిళా సామాజిక సేవా కార్యకర్త బి.పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ టి.సోనీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ అడ్వకేట్, మహిళా సామాజిక సేవా కార్యకర్త బి.పద్మావతి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం ఇంకా సమాజంలో మహిళలపై ఎన్నో అత్యాచారాలు, దాడులు, వివక్షతలు జరుగుతున్నాయని, స్త్రీ పురుష, తారతమ్యం చూపిస్తున్నారని, మహిళలను పురుషులతో పాటు సమానంగా చూసి గౌరవించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యమూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్ కుమార్, పౌరసంస్థల సభ్యులు ఎన్.ఐసయ్య, అధ్యాపకులు సుభాషిణి, దుర్గా, సౌజన్య, స్వర్ణలత, హేమలత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య మహిళా కార్మికులకు సత్కారం

రాజోలు: మహిళా దినోత్సవం పురస్కరించుకుని రాజోలు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్య మహిళా కార్మికులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక రోటరీ భవనంలో అధ్యక్షుడు ఏడిద కవీంద్ర, కార్యదర్శి చిట్టినీడి లక్ష్మణరావుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు చీరలు, పండ్లు, నగదు అందజేశారు. ప్రజల ఆరోగ్యం కాపాడడంలో ఎంతో శ్రమిస్తున్నారని అలాంటి పారిశుధ్య కార్మికులను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. రొటేరియన్లు డాక్టర్ బసవ వరహాలు, కాసు శ్రీను, నార్కెడమిల్లి బాలకృష్ణ, ఐ.సూర్యనారాయణ మూర్తి, బొరుసు తిరుమలరావు, నామన షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గోవింద మాలధారణ

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు సామూహిక గోవింద మాలధారణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి పవన్ దీక్షితుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మాలధారణ చేసిన భక్తులు స్వామి వారి దుస్తులు, దీక్షాకాలంలో వసతి సౌకర్యాలు ఆలయ నిర్మాణ దాత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు (రమణరాజు) దంపతులు సమకూర్చారు. పెద్ద సంఖ్యలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రమణరాజు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19 వరకు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు విధిగా హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.